సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా

బుధవారం । 5 । ఏప్రిల్ । 2023



కలెక్టర్ సుడిగాలి పర్యటన

జి.మాడుగుల మండలం గెమ్మెలి పంచాయతీలో మంగళవారం కలెక్టర్ సుమిత్‌కుమార్ పర్యటించారు. పాఠశాలను తనిఖీ చేశారు. 8లో



ఉపాధిలో రాజవొమ్మంగి ఫస్ట్

ఉపాధిహామీ పథకం అమలులో జిల్లాలోనే రాజవొమ్మంగి ప్రథమస్థానంలో నిలిచిందని ఎంపీడీవో బాపన్నదొర పేర్కొన్నారు 8లో



త్వరితగతిన భూసర్వే

జగనన్న భూరక్ష, శాశ్వత భూహక్కు సర్వే పనులను త్వరితగతిన పూర్తిచేయాలని జేసీ శివశ్రీనివాస్ సూచించారు. 8లో



దిగుబడి.. ధరలేక దిగాలు

ఏజెన్సీలో గిరి రైతులకు ప్రధాన ఆదాయ వనరు జీడిమామిడి. ఈ ఏడాది అకాల వర్షాలు.. మంచు.. దిగుబడులపై తీవ్ర ప్రభావం చూపింది. దీంతో వారికి దిక్కుతోచని పరిస్థితి ఏర్పడింది. దిగుబడి తగ్గినా కనీసం ధర కూడా పెరగలేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పిక్కలపై మచ్చలు రావడంతో వ్యాపారులు ధర తగ్గించేస్తున్నారని వారు వాపోతున్నారు.

- నాలుగు బస్తాల నుంచి రెండు బస్తాలకు తగ్గుదల
- జీడిమామిడి రైతును దెబ్బతీసిన ప్రకృతి
- గతంలో బస్తా రూ.10 వేల నుంచి రూ.12 వేలు
- నేడు రూ.8 వేల నుంచి రూ.8,200
- పడిపోయిన ఆదాయం



వర్షాలకు తేమ చేరడంతో జీడిమామిడి పిక్కలను నీడన ఆరబెడుతున్న రైతులు

రాజవొమ్మంగి: ఏజెన్సీ వ్యాప్తంగా జీడిమామిడి పిక్కల కొనగోళ్లు ఊపందుకున్న ఆనందం గిరి రైతుల్లో లేకుండా పోయింది. దిగుబడి తగ్గడంతో పాటు ధర లేకపోవడం వల్ల నిరాశతో ఉన్నారు. గతేడాది 80 కిలోల బస్తా ధర రూ.10 వేల నుంచి రూ.12 వేల వరకు ఉండేది. ఈ ఏడాది రూ.8 వేల నుంచి రూ.8,200 మాత్రమే ధర లభించడం నిరాశకు గురిచేస్తోంది. గతంలో ఎకరాకు ఐదు బస్తాల వరకు దిగుబడి వచ్చేది. సీజన్ ప్రారంభంలో పొగమంచు కారణంగా పూత మాడిపోయింది. దీంతో ఎకరాకు కనీసం రెండు బస్తాల దిగుబడి కూడా రాలేదని గిరి రైతులు వాపోతున్నారు. దిగుబడి తగ్గడం వల్ల ధర పెరగకపోతుందా అనే ఆశతో వారున్నారు.

దెబ్బతీసిన అకాల వర్షాలు

ప్రస్తుతం కురుస్తున్న అకాల వర్షాలు జీడి రైతులను కోలుకోలేని దెబ్బతీస్తున్నాయి. వర్షాల కారణంగా పూత నిలబడి, పెద్ద సైజు పిందెలు వస్తాయని భావించిన రైతులు దాదాపు ప్రతిరోజూ వర్షం కురుస్తున్నందున దిగాలు చెందుతున్నారు. ఇప్పటికే పక్వానికి వచ్చిన పిక్కలను రైతులు సేకరిస్తున్నారు. అయితే వర్షం కారణంగా పిక్కలు పూర్తిగా తడిసిపోయి, వాటిపై మచ్చలు వస్తున్నాయని ఆందోళన చెందుతున్నారు. పిక్కలపై మచ్చలు రావడంతో వ్యాపారులు ధరలేదంటూ సరకును తిప్పి పంపేస్తున్నారని రైతులు తెలిపారు. తప్పనిసరి పరిస్థితుల్లో వారు చెప్పిన ధరకు విక్రయించాల్సి వస్తోందని వారు పేర్కొన్నారు.

పెరుగుతున్న సాగు విస్తీర్ణం

ఏజెన్సీ ప్రాంతంలో ఇటీవల జీడిమామిడి సాగు విస్తీర్ణం గణనీయంగా పెరిగింది. ఎక్కువ మంది గిరిజనులు జీడిమామిడి తోటలపైనే ఆధారపడుతున్నారు. అంతంతమాత్రం ఆర్థిక పరిస్థితి ఉన్న గిరిజనులకు ఈ పంటపై వచ్చే ఆదాయమే ప్రధాన ఆధారం. రంపచోడవరం, చింతూరు డివిజన్లలోని 11 మండలాల్లో దాదాపు 36వేల ఎకరాల్లో జీడిమామిడి తోటలు ఉన్నాయి.

ఈ ఏడాది ఎకరాకు నాలుగు బస్తాల వరకు దిగుబడి రావచ్చని అంచనా వేస్తున్నామని రంపచోడవరం ఉద్యానవనశాఖ అధికారి రమేష్ తెలిపారు. జీడిపిక్కలను పూర్తిగా ఆరబెట్టిన తరువాతనే మార్కెట్‌కు తరలించడం వల్ల మంచి ధర వస్తుందని ఆయన రైతులకు సూచించారు.



రాజవొమ్మంగిలో జీడిమామిడి పిక్కలను తూకం వేస్తున్న వ్యాపారులు

అయ్యన్న అలక!



- గంటాకు ప్రాధాన్యమివ్వడంపై కినుక
- చంద్రబాబు సమావేశానికి వచ్చేది లేదని స్పష్టీకరణ
- అయ్యన్నను బుజ్జగిస్తున్న టీడీపీ సీనియర్లు
- తన నియోజకవర్గంలో గంటా జోక్యంపై అనిత మండిపాటు

సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం: మాజీ మంత్రి, టీడీపీ సీనియర్ నాయకుడు అయ్యన్నపాత్రుడు అలకబూనారు. పార్టీని అంటిపెట్టుకున్న తమని కాదని.. ఇన్ని రోజులూ పార్టీకి దూరంగా ఉన్న గంటా శ్రీనివాసరావుకు ప్రాధాన్యమివ్వడంపై రగిలిపోతున్నారు. పార్టీలో తన పాత్రపై తాడోపేడో తేల్చుకునేందుకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో పార్టీ అధినేత చంద్రబాబు ఈ నెల 5వ తేదీన విశాఖలోని వి-కన్వెన్షన్‌లో నిర్వహించే పార్టీ ఉత్తరాంధ్ర జోనల్ సమావేశానికి రానని తేల్చి చెప్పినట్లు సమాచారం. దీంతో అయ్యన్నను ఆ పార్టీ సీనియర్ నేతలు కొందరు బుజ్జగించే ప్రయత్నం చేస్తున్నట్లు భోగట్టా. పార్టీలో తనకు ప్రాధాన్యతతోపాటు ఎమ్మెల్యే టికెట్, తన కొడుకుకు ఎంపీ సీటు ఇస్తామన్న స్పష్టమైన హామీ కోసం అయ్యన్న పట్టుబడుతున్నట్లు సమాచారం. మరో వైపు పాయకరావుపేట నియోజకవర్గంలోనూ గంటా జోక్యం చేసుకుంటూ తనకు టికెట్ రాకుండా చేస్తున్నారంటూ అనిత కూడా మండిపడుతున్నారు. బుధవారం సమావేశానికి అయ్యన్నతో పాటు గండి బాబ్జీ, ఎమ్మెల్యే వెలగపూడి హాజరుకావడంపై కూడా సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

అధిష్టానం తీరుపై అసంతృప్తి: ఇన్ని రోజులుగా పార్టీకి దూరంగా ఉండి.. ఇప్పుడు ఎన్నికలకు ముందు హడావుడి చేస్తున్న నేతలతో జాగ్రత్తగా ఉండాలంటూ గతంలో విశాఖలో చంద్రబాబు నిర్వహించిన సమావేశంలోనే అయ్యన్నపాత్రుడు కుండబద్దలు కొట్టినట్టు హెచ్చరించారు. ఎవరండీ గంటా.? లక్షల్లో ఒకరు.. ఆయన ఏమైనా పెద్ద నాయకుడా.? అని ప్రశ్నించారు. ఇన్ని రోజులుగా ఇంట్లో నక్కుకుని.. ఇప్పుడు బయటకు వస్తున్నారని.. వారితో జాగ్రత్తగా ఉండాలని స్పష్టం చేశారు. అయినప్పటికీ అధిష్టానం గంటాకే తాజాగా మద్దతు తెలపడం అయ్యన్నకు రుచించడం లేదు. తాజాగా జరిగిన ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూడా అంతా తానే నడిపించినట్టుగా గంటా వ్యవహరించడంతో పాటు ఎమ్మెల్సీ ప్రమాణ స్వీకారానికి కూడా హాజరయ్యారు. ఈ వ్యవహారాలకు అయ్యన్న దూరంగా ఉన్నారు. తన కుమారుడికి అనకాపల్లి ఎంపీ టికెట్ అడుగుతుంటే... వేరే వ్యక్తిని గంటా ప్రతిపాదిస్తున్నారని అయ్యన్న అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో తాడోపేడో తేల్చుకునేందుకు అయ్యన్న సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది.

గంటా జోక్యంపై ఆగ్రహం: నర్సీపట్నం నియోజకవర్గం మాకవరపాలెం మండలం బూరుగుపాలెంలో ఇటీవల జరిగిన స్థానిక పండగకు గంటాను రుత్తల యర్రాపాత్రుడు ఆహ్వానించారు. మాజీ ఎమ్మెల్యే ముత్యాలపాప, మాజీ మంత్రి బండారు సత్యనారాయణను పిలిచారు. అయితే ఈ సమావేశానికి అయ్యన్న వ్యతిరేకులైన ముత్యాలపాప, బండారు హాజరయ్యారు. ఈ వ్యవహారం వెనుక కూడా గంటానే ఉన్నారనే అనుమానాలను అయ్యన్న వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు పాయకరావుపేట నియోజకవర్గంలో కూడా గంటా జోక్యం చేసుకుంటున్నారంటూ అనిత ఆగ్రహంతో ఉన్నారు. ఈ పరిస్థితుల్లో తనకు వ్యతిరేకంగా సమావేశమైన నేతలను పార్టీ నుంచి అనిత సస్పెండ్ చేయించారు. ఈ వ్యవహారంపై బహిష్కరణకు గురైన నేతలు అనిత తీరుపై మండిపడుతున్నారు. కాపు నేతలను అనిత సహించడం లేదని, గతంలో కాపు నేతలపై చెప్పుతో దాడి చేయించారని విమర్శిస్తున్నారు. దీనిపై టీడీపీ సమాధానం చెప్పకపోతే ఆ పార్టీ తీరును ఎండగడతామని హెచ్చరించారు. ఇదిలా ఉండగా.. విశాఖలో జరిగే సమావేశానికి అయ్యన్నతో పాటు గండి బాబ్జీ, తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి కూడా దూరంగా ఉంటారనే ప్రచారం జరుగుతోంది. అయితే.. వెలగపూడి మాత్రం తన తల్లికి ఆరోగ్యం సరిగా లేకపోవడంతో విజయవాడలో ఉన్నాననే సమాచారం ఇచ్చినట్టు తెలుస్తోంది. విశాఖలో బుధవారం జరిగే చంద్రబాబు సమావేశానికి ముందే పార్టీలో అంతర్గత కలహాలు రచ్చకెక్కడం చర్చకు దారి తీసింది.

న్యూస్‌రీల్

చీర కట్టిన వరి పైరు



ఘాట్‌లో డైమాండ్ పార్కు వద్ద రబీ వరిపంటకు రక్షణగా ఏర్పాటుచేసిన చీరలు

సాక్షి, పాడేరు: రబీలో సాగవుతున్న వరిపంట పశువుల కంట పడకుండా గిరి రైతులు చీరలను పైరు చుట్టూ కడుతున్నారు. పాడేరు ఘాట్‌రోడ్డులోని డైమాండ్ పార్కు సమీపంలో ఈ దృశ్యం కనువిందు చేస్తోంది.

రైల్వే ప్రమాదాల నివారణపై అవగాహన



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఆర్‌పీఎఫ్ ఎస్‌ఐ మహేష్

అరకులోయ రూరల్: రైల్వే ప్రమాదాల నివారణపై అవగాహన కల్పిస్తున్నామని ఆర్‌పీఎఫ్ ఎస్‌ఐ మహేష్ తెలిపారు. మంగళవారం అరకులోయ, డుంబ్రిగుడ మండలాల పరిధిలోని యండపల్లివలస, అరకు సంతబయలు, అడపవలస తదితర గ్రామాల్లో ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు.రైల్వే ట్రాక్‌లు ఉన్న పరిసర గ్రామాల ప్రజలు చిన్న పిల్లలు ఆడుకునేందుకు అటువైపు వెళ్లకుండా చూడాలన్నారు. పెద్దలు కూడా జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ఆర్‌పీఎఫ్, ఏఎస్‌ఐ మోహన్, రమేష్ పాల్గొన్నారు.

పాత నేరస్తుడు అరెస్టు



నిందితుడు కేశవరాజుతో పోలీసులు

రాజవొమ్మంగి: జడ్డంగి స్టేషన్ పరిధిలో నమోదు అయిన గంజాయి కేసులో నిందితుడు చింతపల్లి మండలం నిమ్మలపాడు గ్రామానికి చెందిన గమ్మెలి కేశవరావును మంగళవారం అరెస్టు చేసినట్లు సీఐ ఎస్‌కే బాజిలాల్ తెలిపారు. 2022 డిసెంబర్ 30లో నమోదు అయిన గంజాయి కేసులో నిందితుడైన కేశవరాజు అప్పటి నుంచి తప్పించుకొని తిరుగుతున్నాడని ఆయన తెలిపారు. ఈ నేపథ్యంలో నిఘా ఏర్పాటుచేసి అతనిని పట్టుకుని కోర్టులో హాజరు పరిచామని ఆయన పేర్కొన్నారు. ఎస్‌ఐ షరీఫ్ పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నీ విజేత చిన్నూరు



చిన్నూరు జట్టుకు బహుమతి అందిస్తున్న ఎంపీటీసీ పద్మావతి, సర్పంచులు లీలావతి

గంగవరం : మండలంలోని జియ్యంపాలెంలో 20 రోజులుగా నిర్వహించిన ఫ్రెండ్స్ క్రికెట్ లీగ్ (ఎఫ్‌సీఎల్) క్రికెట్ టోర్నమెంట్ విజయవంతంగా ముగిసింది. టోర్నీ విజేతగా చిన్నూరు క్రికెట్ జట్టు, ద్వితీయ స్థానంలో కొత్తపల్లి జట్టు నిలిచాయి. ఈ సందర్భంగా నిర్వహించిన ముగింపు కార్యక్రమంలో ఎస్‌ఐ చినబాబు, మొల్లేరు సొసైటీ డైరెక్టర్ పండా సిద్ధార్థదొర, వ్యాపారవేత్త బండి జగదీష్, సూరంపాలెం ఎంపీటీసీ కుంజం పద్మావతి, జియ్యంపాలెం , జగ్గంపాలెం సర్పంచ్‌లు తుర్రం లీలావతి, కంగల సుబ్బలక్ష్మి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. విజేతలకు బహుమతులు అందజేశారు. ప్రథమస్థానంలో నిలిచిన చిన్నూరు జట్టుకు ట్రోఫీ, రూ.20 వేలు, ద్వితీయ స్థానంలో నిలిచిన కొత్తపల్లి టీమ్‌కు రూ.10 వేల చొప్పున నగదు బహుమతి, వ్యక్తిగత చాంపియన్లకు బహుమతులు అందజేశారు. ఈ టోర్నీలో 40 జట్లు పాల్గొన్నాయి.

మహిళా సంక్షేమంతోనే సమాజాభివృద్ధి

పాడేరు ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి

గూడెంకొత్తవీధి: మహిళల సంక్షేమంతోనే సమాజం బాగుంటుదని నమ్మిన ముఖ్యమంత్రి వారి ఆర్థికాభివృద్ధికి చేయూత అందిస్తున్నారని పాడేరు ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి అన్నారు. మంగళవారం మండలకేంద్రంలో వెలుగు ఆధ్వర్యంలో వైఎస్సార్ ఆసరా సంబరాలు జరిగాయి. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. పద్దెనిమిదేళ్లు నిండిన తరువాత ఆడపిల్లలకు వివాహాలు జరిపిస్తామని మహిళలతో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించడంతోపాటు అన్ని రంగాల్లోనూ రాణించాలన్న ధ్యేయంతోనే ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి వైఎస్సార్ ఆసరా కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేస్తున్నారన్నారు. రాష్ట్రంలో రూ. 25 వేల కోట్ల రుణాన్ని మాఫీ చేస్తామని హామీ ఇచ్చిన జగనన్న ఇప్పటి వరకూ మూడు విడతల్లో రూ.6,419 కోట్ల మేర రుణమాఫీ చేశారన్నారు. దీనిలో భాగంగా గూడెంకొత్తవీధి మండలంలో ఇప్పటి వరకూ రూ.3 కోట్ల మేర రుణమాఫీ జరిగిందన్నారు. చింతపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ రాజులమ్మ, జెడ్పీటీసీ శివరత్నం, ఎంపీపీ కుమారి, జిల్లా ఎస్టీసెల్ అధ్యక్షుడు లక్ష్మణ్, వైస్‌ఎంపీపీలు ఆనంద్, దేముడు, సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు రామకృష్ణ, సర్పంచ్‌లు కృష్ణమూర్తి, సుభద్ర, లక్ష్మి సరోజిని, నాగరాజు ఎంపీటీసీలు నాగమణి సాంబమూర్తి, యువజన సంఘ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఆర్థిక బలోపేతమే లక్ష్యంగా పాలన

రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి



వైఎస్సార్ ఆసరా చెక్కును పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ధనలక్ష్మి

ఎటపాక: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహనరెడ్డి పాలనలో మహిళలు ఆర్థికాభివృద్ధి సాధిస్తున్నారని రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి అన్నారు .మూడవ విడత వైఎస్సార్ ఆసరా చెక్కుల పంపిణీ కార్యక్రమం తోటపల్లిలో మంగళవారం నిర్వహించారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. మూడవ విడత ఆసరాలో భాగంగా 918 సంఘాలకు ప్రభుత్వం విడుదల చేసిన రూ.5.93 కోట్ల విలువైన చెక్కును ఎమ్మెల్యే ధనలక్ష్మి మహిళలకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత పాలకులు మండలానికి సుమారు రూ.25 కోట్ల అప్పును మిగిల్చగా, ఎన్నికల ముందు అక్క చెల్లెమ్మలకు జగనన్న ఇచ్చిన మాట ప్రకారం విడతల వారీగా మీ ఆ మొత్తాన్ని చెల్లిస్తున్నారని పేర్కొన్నారు. రాష్ట్రంలో మహిళలు ఆర్థికంగా బలోపేతం చేయాలన్నదే ముఖ్యమంత్రి ధ్యేయమని, ఆ దిశగా పాలన సాగిస్తున్న ఘనత మన ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ ఉబ్బా సుస్మిత, ఎంపీపీ కాక కామేశ్వరి, రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యులు చిచ్చడి మురళి, ఏపీఎం స్వామి, ఎంపీడీవో విఠల్‌పాల్, తహసీల్దార్ వేణుగోపాల్, సొసైటీ చైర్మన్ ఆకుల వెంకటరామారావు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్లు తానికొండ వాసు, రామలింగారెడ్డి, రాష్ట్ర యూత్ కార్యదర్శి గోసు ప్రశాంత్, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

ఆదివాసీలకు నష్టం జరగనివ్వం

- అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ
- డ్వాక్రా మహిళలకు వైఎస్సార్ ఆసరా చెక్కు పంపిణీ



వైఎస్సార్ ఆసరా చెక్కును డ్వాక్రా మహిళలకు అందజేస్తున్న ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ

డుంబ్రిగుడ: బోయ వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్పించినా ఆదివాసీలకు ఎటువంటి నష్టం జరగనివ్వమని ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి హామీ ఇచ్చారని అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ అన్నారు. స్థానిక అల్లూరి గ్రౌండ్ వద్ద మంగళవారం వెలుగు ఆధ్వర్యంలో వైఎస్సార్ ఆసరా సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి ఆయనతోపాటు, వెలుగు క్లస్టర్ కోఆర్డినేటర్ కృష్ణారావు, డ్వాక్రా సభ్యులు కలిసి క్షీరాభిషేకం నిర్వహించారు. థ్యాంక్యూ సీఎం సార్ అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. మండలంలోని 18 పంచాయతీల్లో 414 సంఘాలకు మూడో విడత కింద మంజూరైన రూ.కోటి ఇరవై లక్షల 22 వేలకు సంబంధించిన చెక్కును లబ్ధిదారులకు ఎమ్మెల్యే పాల్గుణ అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గతంలో జరిగిన జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల్లో సీట్ల కేటాయింపు రిజర్వేషన్లలో ఆదివాసీ గిరిజనులకు పూర్తిగా న్యాయం చేశారని గుర్తుచేశారు. బోయ వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చినా ఆదివాసీలకు ఎటువంటి నష్టం జరగనివ్వకుండా చర్యలు తీసుకుంటామని ముఖ్యమంత్రి హామీ ఇచ్చినట్టు ఆయన వెల్లడించారు. రుణాలను మాఫీ చేస్తామని మాట ఇచ్చి డ్వాక్రా సభ్యులను వంచించిన ఘనత చంద్రబాబుదేనన్నారు. వైఎస్సార్ ఆసరా సొమ్ముతో మహిళలు వ్యాపారాలు చేసుకోవడం సంతోషంగా ఉందన్నారు. రానున్న ఎన్నికల్లో కూడా వైఎస్సార్ సీపీకి మద్దతుగా ఉండి మరోసారి జగన్‌మోహన్ రెడ్డిని ముఖ్యమంత్రి చేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ బాక ఈశ్వరి, జెడ్పీటీసీ చట్టారి జానకమ్మ, వైస్ ఎంపీపీలు శెట్టి ఆనందరావు, పంచడి లలిత, మాజీ జెడ్పీటీసీ శ్రీరాములు, మండల పార్టీ అధ్యక్షుడు శెట్టి గోపాల్, మండల పార్టీ మహిళ అధ్యక్షురాలు శాంతి, ఏపీఎం శ్రీనివాసరావు, దాసు, ఎంపీడీవో నగేష్, డిప్యూటీ తహసీల్దార్ నజీర్ పాల్గొన్నారు.

ఎటపాక: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లి ఆదివాసీలకు ఎటువంటి అన్యాయం జరగకుండా చూస్తామని రంపచోడవరం ఎమ్మెల్యే ధనలక్ష్మి హామీ ఇచ్చారు. వైఎస్సార్ ఆసరా సంబరాల నిమిత్తం మంగళవారం మండలానికి విచ్చేస్తున్న ఆమెను ఆదివాసీ సంఘాల ప్రతినిధులు కలిసి తమ సమస్యను వివరించారు.

గురుకులంలో ప్రవేశాలకు

దరఖాస్తుల ఆహ్వానం

రంపచోడవరం: ఏపీ గిరిజన సంక్షేమ గురుకుల విద్యాలయాల్లో (బాలురు) 2023–24 విద్యా సంవత్సరంలో ఇంగ్లీషు మీడియంలో ప్రవేశం కోసం దరఖాస్తులు కోరుతున్నట్లు ప్రిన్సిపాల్ ఎస్ నరసింహమూర్తి తెలిపారు. స్థానిక బాలుర గురుకుల పాఠశాలలో ఐదో తరగతిలో 80 ఖాళీలు ఉన్నట్లు తెలిపారు. నాలుగో తరగతి ఉత్తీర్ణత చెందిన వారు గురుకులం వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఎస్టీకి 60 సీట్లు, ఎస్సీకి 10, బీసీకి 4, ఓసీకి 2, ఏఈక్యూ 2, పీహెచ్‌సీ (ఎస్టీ) 2 సీట్లు ఉన్నట్లు తెలిపారు. ఈ నెల 30 వరకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. వచ్చేనెల 7వతేదీన ప్రవేశ పరీక్ష ఉంటుందన్నారు. ప్రవేశానికి రికార్డు షీట్, ఆధార్ కార్డు, రేషన్ కార్డు, కులధ్రువీకరణ, ఆదాయ ధ్రువపత్రాలు ఉండాలని సూచించారు. పూర్తి వివరాలకు పాఠశాలలో సంప్రదించాలని ఆయన కోరారు.

అడ్డతీగల: స్థానిక గురుకుల పాఠశాలలో 2023–24 విద్యాసంవత్సరానికి సంబంధించి ఐదో తరగతి (ఇంగ్లీషు మీడియం)లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ప్రిన్సిపాల్ హరినాథ్ మంగళవారం తెలిపారు. ప్రస్తుతం నాల్గవ తరగతి చదువుకుంటున్న విద్యార్థులు ఈ ప్రవేశాలకు అర్హులన్నారు. ఎస్టీ, ఎస్సీ విద్యార్థులు 2010 జూన్ 1 నుంచి 2014 మే 31 మధ్యలో జన్మించి ఉండాలన్నారు. బీసీ, ఓసీ విద్యార్థులు 2012 జూన్ 1 నుంచి 2014 మే 31 మధ్యలో పుట్టినవారు అయిఉండాలన్నారు. వార్షిక ఆదాయం ఏడాదికి రూ.లక్షలోపు ఉండాలని సూచించారు. కుల ధ్రువీకరణ పత్రం తప్పనిసరిగా సమర్పించాలన్నారు. రిజర్వేషన్ల ప్రకారం సీట్లు ఎస్టీ 60, ఎస్సీ 10, బీసీ 4, పీహెచ్‌సీ ఎస్టీ 2, ఓసీ 2, ఏఈక్యూ రెండు ఉన్నాయన్నారు. అలాగే 6,7,8,9 తరగతుల్లో బ్యాక్‌లాగ్ ఖాళీలు (ఎస్టీలకు మాత్రమే) ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. దరఖాస్తుల స్వీకరణకు ఈనెల 30 వరకు గడువు ఉందన్నారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు వచ్చేనెల 7వ తేదీన ప్రవేశ పరీక్ష నిర్వహిస్తామని తెలిపారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తులు సమర్పణకు గురుకుల పాఠశాలతో పాటు నెట్ సెంటర్లలోనూ అవకాశం ఉందని ప్రిన్సిపాల్ సూచించారు.

గంజాయి స్వాధీనం.. ఎనిమిది మంది అరెస్టు 8లో

ఒకే రోజు.. మూడు కాలాలు



పాడేరు పాతబస్టాండ్‌లో ఉదయం కురుస్తున్న మంచు



మధ్యాహ్నం ఎండకు గొడుగుల నీడన చిరువ్యాపారులు



పాతబస్టాండ్ వద్ద మెయిన్‌రోడ్డులో కురుస్తున్న వర్షం

జెన్సీలో పాడేరుతో పాటు సమీప ప్రాంతాల్లో కొద్దిరోజులుగా భిన్నమైన వాతావరణ పరిస్థితులు నెలకొంటున్నాయి. మంగళవారం పాడేరులో ఉదయం దట్టంగా పొగమంచు కురిసింది. మధ్యాహ్నం ఎండ చుర్రుమంది. 3.30గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు భారీ వర్షం కురిసింది. ఇలా ఒకే రోజు మన్యం వాసులు మూడు కాలాల వాతావరణ పరిస్థితులను ఆస్వాదిస్తూ ప్రత్యేక అనుభూతిని పొందుతున్నారు.

– సాక్షి, పాడేరు

క్లుప్తంగా

సచివాలయ ఉద్యోగులు సమయపాలన పాటించాలి



కె.కోడాపల్లిలో సంపద కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీపీవో కొండలరావు

జి.మాడుగుల: గ్రామ సచివాలయాల ఉద్యోగులు సమయపాలన పాటించాలని, రికార్డులు సక్రమంగా నిర్వహించాలని, యూనిఫారాలు తప్పనిసరిగా ధరించాలని జిల్లా పంచాయతీ అధికారి(డీపీవో) టి.కొండలరావు ఆదేశించారు. మండలంలో కె.కోడాపల్లి పంచాయతీ కేంద్రాన్ని మంగళవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు.ముందుగా కె.కోడాపల్లిలోని సంపద కేంద్రాన్ని పరిశీలించి సూచనలు చేశారు. అనంతరం సచివాలయాన్ని సందర్శించారు. రికార్డులు సక్రమంగా నిర్వహించాలని, లేదంటే శాఖపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి చిన్నంనాయుడు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

పోక్సో చట్టం కింద యువకుడి అరెస్టు

మునగపాక : మండలంలోని రాజుపేటకు చెందిన ఓ యువకునిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి మంగళవారం రిమాండ్‌కు తరలించినట్టు పరవాడ డీఎస్పీ పి.శ్రీనివాసరావు విలేకరులకు తెలిపారు. మండలానికి చెందిన మైనర్ బాలిక గత నెల 8వ తేదీన కళాశాలకు వెళతానని చెప్పి తిరిగి ఇంటికి రాలేదు. దీంతో బాలిక తల్లిదండ్రులు మునగపాక పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు బాలిక అదృశ్యంపై కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. ఇదే మండలానికి చెందిన యువకుడు సదరు బాలికతో కలిసి హైదరాబాద్‌లో ఉన్నట్టు గుర్తించారు. కేసు విచారణలో భాగంగా పోలీసులు, మైనర్‌బాలిక బంధువులు హైదరాబాద్ వెళ్లి బాలికను తీసుకువచ్చారు. అయితే యువకుడి ఆచూకీ లేకపోవడంతో గాలింపు చేపట్టారు. మంగళవారం రాజుపేట సమీపంలో పోలీసులు వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా ఆ యువకుడు కనిపించడంతో అతనిని పట్టుకొని స్టేషన్‌కు తరలించారు. దీంతో పరవాడ డీఎస్పీ శ్రీనివాసరావు కేసు విచారణలో భాగంగా యువకుడిని పోక్సో చట్టం కింద అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు.

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు

- గృహనిర్మాణాన్ని వేగవంతం చేయాలి
- అధికారులు ప్రొటోకాల్ పాటించాలి
- గైర్హాజరు అధికారులపై చర్యలు
- జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ జె.సుభద్ర
- జెడ్పీ స్థాయీ సంఘాల సమావేశంలో సభ్యులు



మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర



హాజరైన సభ్యులు

సాక్షి, విశాఖపట్నం: ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలు ప్రజలకు మరింత చేరువ చేయాలని, వాటి ఫలితాలు అర్హులందరికీ అందేలా చూడాలని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ జె.సుభద్ర అధికారులను ఆదేశించారు. ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలపై జెడ్పీటీసీలకు ఎప్పటికప్పుడు తెలియజేయాలని సూచించారు. మంగళవారం జెడ్పీ సమావేశ మందిరంలో చైర్‌పర్సన్ అధ్యక్షతన ఏడు స్థాయీ సంఘాల సమావేశాలు జరిగాయి. పెళ్లి కానుకపై గ్రామ సచివాలయాల సిబ్బందికి అవగాహన కల్పించాలని కోరారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న జగనన్న కాలనీ ఇళ్లను సత్వరమే పూర్తి చేయాలని గృహనిర్మాణ శాఖ అధికారులను ఆదేశించారు. ఇంట్లోనే టైలరింగ్ వృత్తి చేసుకునే టైలర్లకు కూడా జగనన్న చేదోడు కింద రూ.10 వేలు చెల్లించేందుకు అనుమతి లభించిందని బీసీ కార్పొరేషన్ ఈడీ ఆర్.ప్రసాద్ చెప్పారు.

కేజీహెచ్‌లో మెరుగైన సేవలు

విశాఖ కేజీహెచ్‌లో గతంకంటే వైద్య సేవలు మెరుగయ్యాయని జెడ్పీ చైర్‌పర్సన్ సహా పలువురు సభ్యులు కితాబునిచ్చారు. ప్రస్తుత సూపరింటెండెంట్ అశోక్‌కుమార్ సమస్యలపై స్పందిస్తున్నారన్నారు. చిన్న పిల్లల ఆరోగ్యం బాగా క్షీణించాక కేజీహెచ్‌కు తీసుకొస్తున్నారని, దీంతో వీరిలో ఎక్కువ మంది మృత్యువాత పడుతున్నారని అశోక్‌కుమార్ చెప్పారు. అందువల్ల అనారోగ్యంతో ఉన్న పిల్లలను సకాలంలోనే కేజీహెచ్‌కు తీసుకురావాలని కోరారు. గత మూడు నెలల్లో కేజీహెచ్‌లో 214 మంది పిల్లలను తీవ్ర అనారోగ్యంతో చేర్చారని, వీరిలో 164 మందికి నయం చేసి పంపామని, 12 మంది పిల్లలు మరణించారని వివరించారు. ఇటీవల విశాఖ ఏజెన్సీలోని గన్నెల పంచాయతీలో ఏడుగురు మరణాలకు వేర్వేరు కారణాలని విచారణలో తేలిందని హుకుంపేట జెడ్పీటీసీ మత్స్యలింగం అడిగిన ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. ఏజెన్సీలో మూఢ నమ్మకాలు తగ్గించాలని, చిన్న పిల్లల వైద్యుల సంఖ్యను పెంచాల్సి ఉందని డీఎంహెచ్‌వో జగదీశ్వరరావు చెప్పారు. గత ప్రభుత్వాలన్నిటికంటే ప్రస్తుత ప్రభుత్వం వైద్య రంగానికి అధిక ప్రాధాన్యతనిస్తోందన్నారు.

ప్రొటోకాల్ పాటించాల్సిందే..

మండలాల అధికారులు ప్రొటోకాల్ పాటించడం లేదని పలువురు సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. మండలాల్లో అభివృద్ధి పనులకు ఏర్పాటు చేసే శిలాఫలకాలపై జెడ్పీటీసీల పేర్లు విధిగా ఉండేలా చూడాలని, స్థాయీ సంఘాల సమావేశానికి గైర్హాజరైన అధికారులపై చర్యలు తీసుకోవాలని జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర సీఈవోను ఆదేశించారు. పరవాడ మండలంలో గ్రావెల్‌ను అక్రమంగా తవ్వుకుపోతున్నారని, దానికి అడ్డుకట్ట వేయాలని కోరారు. సమావేశంలో జెడ్పీ సీఈవో శ్రీరామ్మూర్తి, జెడ్పీటీసీలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

వివాదంలో ఉన్న భూముల్లో పనుల అడ్డగింత



వివాదంలో ఉన్న భూముల్లో పనులను అడ్డుకుంటున్న ఫిర్యాదుదారులు

గొలుగొండ : నర్సీపట్నం ఆర్డీవో కోర్టులో వివాదంలో ఉన్న భూములను గుట్టుచప్పుడు కాకుండా అమ్మకాలు చేపట్టి ఈ భూముల్లో లే అవుట్లు వేసేందుకు పనులు చేపడుతున్నారని ఫిర్యాదు అందడంతో మంగళవారం ఆ పనులను నిలుపుదల చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి. గొలుగొండ రెవెన్యూ పరిధిలో సర్వే నంబర్ 490లో 3.67 ఎకరాలు భూమి ఉంది. జోగుంపేటకు చెందిన చేపల వెంకయ్యమ్మ పేరున ఈ భూమి 40 ఏళ్ల క్రితం కొనుగోలు చేసుకున్నారు. వెంకయ్యమ్మకు కుమారుడు గంగలు, కుమార్తె దొంగతల్లి(చిట్టమ్మ) ఉన్నారు. ఈ నేపథ్యంలో గంగలు వారసులకు ఈ భూమి అన్యాయంగా దఖలు పడిందని ఆరోపిస్తూ వెంకయ్యమ్మ కుమార్తె దొంగతల్లి(చిట్టమ్మ) ఆర్డీవో కోర్టులో రెండేళ్ల క్రితం కేసు వేశారు. తన తల్లి వెంకయ్యమ్మ పేరున ఉన్న భూమిలో తనకు కూడా వాటా వస్తుందని కేసు వేశారు. ఈ కేసు నడుస్తున్న సమయంలోనే గంగలు వారసులు ఈ భూమిని అమ్మకోవడం జరిగిందని, ఆ భూమిలో లేఅవుట్ పనులు చేపడుతున్నారని చిట్టిమ్మ వారసులు అధికారులను ఆశ్రయించడంతో పాటు మంగళవారం ఆ భూమిలో చదును పనులను అడ్డుకున్నారు. గంగలు వారసులు ఆ భూమిని నర్సీపట్నంకు చెందిన వ్యక్తులకు అమ్మకాలు జరిపారని ఆరోపించారు. పోలీసులు, రెవెన్యూ అధికారులు ఇక్కడ ఎటువంటి పనులు చేయరాదని అక్కడి వారిని హెచ్చరించి పనులు నిలుపుదల చేశారు. వివాదం ఆర్డీవో కోర్టులో ఉన్నందున భూమి అమ్మకాలు, కొనుగోళ్లు జరపరాదని స్పష్టం చేశారు. ఆర్ఐ నర్సింగరావు, వీఆర్వో రాజుబాబు, ఏఎస్ఐ అప్పారావు పాల్గొన్నారు.

కలెక్టర్ సుడిగాలి పర్యటన

జి.మాడుగుల: మండలంలోని గెమ్మెలి పంచాయతీలో మంగళవారం కలెక్టర్ సుమిత్‌కుమార్ పర్యటించారు. దీనిలో భాగంగా ఇదే పంచాయతీలో మద్దులబంద మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేశారు. పాఠశాలలో విద్యార్థుల సామర్థ్యం, బోధనపై సమీక్షించారు. పాఠశాల భవనం, పరిసరాలను ఆయన పరిశీలించారు. పాఠశాల భవనం శిథిలావస్థలో ఉన్నందున రేకుల షెడ్డులో విద్యార్థులకు తరగతులు నిర్వహిస్తున్నట్టు ఉపాధ్యాయుడు రామకృష్ణ కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లారు. పాఠశాల భవన నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని ఆయన పేర్కొన్నారు. అనంతరం మద్దులబంద గ్రామాన్ని ఆయన సందర్శించారు. గ్రామంలోని వసతులు, గిరిజన పంటలు, గిట్టుబాటు ధరలు, విక్రయాలపై రైతులతో మాట్లాడారు. ఇతర సమస్యలను ఆయన తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో చంద్రశేఖర్, తహసీల్దార్ అప్పలస్వామి, సర్పంచ్ సీదరి కొండబాబు పాల్గొన్నారు.

చురుగ్గా కిన్నెర్లోవ రోడ్డు నిర్మాణ పనులు

తప్పనున్న డోలీమోత



కిన్నెర్లోవ రోడ్డు

హుకుంపేట: మండలంలోని మారుమూల తీగలవలస పంచాయతీ కొండప్రాంతమైన కిన్నెర్లోవ రోడ్డు నిర్మాణ పనులు చురుగ్గా జరుగుతున్నాయి. అభివృద్ధికి దూరంగా ఉన్న మారుమూల కిన్నెర్లోవ, పనసబంద గ్రామాలకు త్వరలో రహదారి సమస్య తీరనుంది.అనారోగ్య పరిస్థితులు ఏర్పడితే రహదారి సరిగ్గా లేక డోలిమోతలు తప్ప వేరే మార్గం లేక ఆయా గ్రామస్తులు అవస్థలు పడుతున్నారు. గతంలో రోడ్డు నిర్మించాలని ఉన్నతాధికారులను కోరడంతో పాటు ఆందోళనలు చేశారు. దీంతో పీఆర్ నిధులు రూ.1.80 కోట్లతో ప్రభుత్వం రహదారి మంజూరు చేసింది.రోడ్డునిర్మాణం పూర్తయితే వారి కష్టాలు తీరుతాయి. రోడ్డుపనులు ప్రారంభంకావడంతో ఆయా గ్రామాల గిరిజనులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ఉపాధిలో రాజవొమ్మంగి ఫస్ట్

రాజవొమ్మంగి: ఉపాధిహామీ పథకం అమలులో జిల్లాలోనే రాజవొమ్మంగి ప్రథమస్థానంలో నిలిచిందని ఎంపీడీవో బాపన్నదొర పేర్కొన్నారు. మంగళవారం ఆయన ఇందుకు సంబంధించిన వివరాలను విలేకరులకు తెలిపారు. గత ఆర్థిక సంవత్సరంలో 5.92 లక్షల పనిదినాలు లక్ష్యం కాగా 5.98 లక్షల పనిదినాల ఉపాధి కల్పించినట్టు ఆయన చెప్పారు. మండలంలోని 62 రెవెన్యూ గ్రామాల పరిధిలో 8,700 కుటుంబాలకు ఉపాధి పనులు కల్పించడం జరిగిందన్నారు. వేతనాలు, మెటీరియల్ రూపేణా రూ.17 కోట్లు చెల్లించినట్టు ఆయన వివరించారు. సిబ్బంది, మేట్లు, వేతనదారుల సహకారం, కృషితోనే లక్ష్యం సాధ్యమైందని ఆయన పేర్కొన్నారు.

త్వరితగతిన భూసర్వే

చింతపల్లి: జగనన్న భూరక్ష, శాశ్వత భూహక్కు కార్యక్రమం సర్వే పనులను త్వరితగతిన పూర్తిచేయాలని జాయింట్ కలెక్టర్ శివశ్రీనివాస్ సూచించారు. మంగళవారం ఆయన మండలంలో పర్యటించారు. తహసీల్దారు కార్యాలయంలో భూ సర్వే పనుల వివరాలను తహసీల్దారు ప్రసాద్ నుంచి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తొలివిడతలో చింతపల్లి మండలం బాలాజీ పేటలో పైలెట్ ప్రాజెక్టుగా సర్వే పూర్తిచేసి లబ్ధిదారులకు అవసరమైన పట్టాలు పంపిణీ చేశామన్నారు. రెండో విడతలో చింతపల్లి మండలంలో 180 గ్రామాలకు గాను 28 గ్రామాల్లో సర్వే పనులు జరుగుతున్నాయని ఆయన పేర్కొన్నారు. అర్హులైన పీవీటీజీలందరినీ ప్రత్యేకంగా ఓటర్లుగా గుర్తింపు జరుగుతుందని జేసీ తెలిపారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం



రైల్వే ట్రాక్‌పై గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

అరకులోయ రూరల్ : మండలంలో స్థానిక పోలీస్ స్టేషన్ సమీపంలో ఉన్న రైల్వే ట్రాక్ వద్ద గుర్తు తెలియని మృతదేహం లభ్యమైందని అరకులోయ రైల్వే ఆర్‌పీఎఫ్ ఎస్ఐ మహేష్ తెలిపారు. మృతుడి వయస్సు సుమారు 45 ఉంటుందన్నారు. స్థానికుల నుంచి సమాచారం తెలుసుకున్న ఆయన విజయనగరం రైల్వే జీఆర్‌పీ పోలీస్ సిబ్బందితో కలిసి మంగళవారం సంఘటన స్థలం చేరుకుని పరిశీలించారు. రెండు రోజుల క్రితం ఈ సంఘటన జరిగి ఉండవచ్చన్నారు. మృతదేహం స్థానిక ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి మార్చురీకి తరలించామన్నారు. సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని, బంధువులు ఎవరైనా ఉంటే ఏరియా ఆస్పత్రిలో సంప్రదించాలని సూచించారు.

సిరులతల్లికి లక్ష కుంకుమార్చన



లక్ష కుంకుమార్చనలో ఆలయ కార్యనిర్వహణాధికారి, భక్తులు

దాబాగార్డెన్స్: కనకమహాలక్ష్మి దేవస్థానంలో మంగళవారం లక్ష కుంకుమార్చన ప్రత్యేక పూజ నిర్వహించారు. ఉదయం 8 నుంచి 11 గంటల వరకు నిర్వహించిన పూజలో నలుగురు ఉభయదాతలు పాల్గొన్నారు. ప్రతి నెలా మొదటి మంగళవారం నిర్వహించే ఈ పూజలో పాల్గొనదలచే భక్తులు రూ.10వేలు చెల్లిస్తే.. వారి తరపున నలుగురు దంపతులు పాల్గొనవచ్చని ఆలయ ఈవో కె.రమేష్‌నాయుడు తెలిపారు. పూజా సామగ్రి దేవస్థానమే సమకూర్చుతుందని పేర్కొన్నారు. పూజలో పాల్గొనే భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్ కొత్తరోడ్డు, అకౌంట్ నెంబరు 060810011006691, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806081లో డబ్బులు చెల్లించవచ్చు. ఆన్‌లైన్ ద్వారా ట్రాన్స్‌ఫర్ చేసిన వారు ట్రాన్సక్షన్ వివరాలు, పూజ జరిపించాల్సిన వారి పేరు, గోత్రనామాలు, పూర్తి చిరునామా, ఫోన్ నెంబరును 8985515989 వాట్సప్‌కు లేదా మెయిల్ ఐడీ endowoekanaka@gov.in ద్వారా పంపవచ్చు.

నగదు చోరీపై ముమ్మర విచారణ

మాకవరపాలెం: పింఛన్ల నగదు చోరీపై క్రైం బ్రాంచి పోలీసులు విచారణ ముమ్మరం చేశారు. మండలంలోని దుంగలవానిపాలెం వద్ద సోమవారం రూ.16.15 లక్షల నగదు చోరీకి గురైన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో పోలీసులకు అందిన ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టిన క్రైం బ్రాంచి ఎస్ఐ రమేష్ మంగళవారం కూడా నగదు డ్రా చేసిన బ్యాంకులోని సీసీ పుటేజీలతోపాటు రోడ్డుకు ఇరువైపులా వివిధ షాపులు, షోరూం వద్ద ఉన్న సీసీ కెమెరాలను కూడా పరిశీలించారు. ఆయన వెంట స్థానిక ఎస్ఐ రామకృష్ణారావు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



ఘటనాస్థలంలో సాధు మృతదేహం

చింతూరు: మండలంలోని సింగన్నగూడెం వద్ద మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం సుకుమా జిల్లా కేర్లాపాల్‌కు చెందిన మడకం సాధు (38) అనే వ్యక్తి మృతిచెందాడు. సాధు తమ్ముడు నందా, కొడుకు నరేష్‌తో కలసి ద్విచక్ర వాహనంపై ఛత్తీస్‌గఢ్ నుంచి భద్రాచలం వైపు వెళుతున్న క్రమంలో సింగన్నగూడెం మూలమలుపు వద్ద అదుపుతప్పి గోతిలో పడిపోయారు. ఈ ఘటనలో సాధు అక్కడికక్కడే మృతిచెందాడు. అతని తమ్ముడు నందా, కొడుకు నరేష్ గాయపడ్డారు. వీరిని 108 వాహనంలో చింతూరు ఏరియా ఆస్పత్రికి తరలించారు. వీరిలో నందా పరిస్థితి విషమంగా ఉందని ఆస్పత్రి వర్గాలు తెలిపాయి.

సింహగిరిపై ఘనంగా పండిత సదస్సు



పండిత సదస్సులో స్వామికి పూజలు నిర్వహిస్తున్న అర్చకులు




స్వామివారి వైభవాన్ని కీర్తిస్తున్న పండితులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి వార్షిక కల్యాణ మహోత్సవాల్లో భాగంగా మూడో రోజు మంగళవారం సాయంత్రం పండిత సదస్సు ఘనంగా నిర్వహించారు. స్వామి ఉత్సవమూర్తి గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలకు విశేష అలంకరణ చేసి కల్యాణమండపంలో వేదికపై వేంజేంపచేశారు. విష్వక్సేణ పూజ, పుణ్యాహవాచనం నిర్వహించారు. అనంతరం రాష్ట్రంలోని పలు ప్రధాన దేవస్థానాల నుంచి వచ్చిన వేద పండితులు తమ పాండిత్యంతో స్వామిని కీర్తించారు. స్వామి వైభవాన్ని వివరించారు. అనంతరం దేవస్థానం తరఫున అధికారులు, అర్చకులు పండితులను సత్కరించారు.

అదే విధంగా కల్యాణోత్సవాల్లో భాగంగా స్వామి స్వర్ణకవచ అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చాడు. ప్రతి గురువారం మాత్రమే లభించే స్వర్ణకవచ అలంకారాన్ని ఏటా వార్షిక కల్యాణోత్సవాల్లో పండిత సదస్సు రోజు కూడా చేయడం పరిపాటి. అలాగే ఉదయం 7 గంటల నుంచి కల్యాణ ఉత్సవమూర్తుల చెంతన వైదిక సదస్యాన్ని నిర్వహించారు.

జన జాతర

పోలమాంబ ఆలయానికి పోటెత్తిన భక్తులు



పోలమాంబ అమ్మవారు

ఏయూక్యాంపస్(విశాఖ): పెదవాల్తేరు కరకచెట్టు పోలమాంబ అమ్మవారి వార్షిక జాతర మంగళవారం అంగరంగ వైభవంగా సాగింది. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారి దర్శనానికి తరలిరావడంతో పెదవాల్తేరులో సందడి నెలకొంది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అబ్బురపరిచాయి.మహిషాసుర మర్దిని, పులివేషాలతో విన్యాసాలు ఆకట్టుకున్నాయి. రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆయనకు ఆలయ అధికారులు, ట్రస్ట్‌బోర్డు సభ్యులు స్వాగతం పలికారు. అనంతరం వేద ఆశీర్వచనం, ప్రసాదం అందించారు. అమ్మవారి చిత్రపటాన్ని బహూకరించారు. వీఎంఆర్డీఏ చైర్‌పర్సన్ అక్కరమాని విజయనిర్మల తదితరులు పాల్గొన్నారు. జాతర నేపథ్యంలో ఆలయంతో పాటు 14 గ్రామాల్లో సందడి వాతావరణం నెలకొంది.

గంజాయి స్వాధీనం.. ఎనిమిది మంది అరెస్టు



గంజాయి నిందితులతో పోలీసులు



చింతూరులో పట్టుబడిన నిందితులతో పోలీసులు

జిల్లాలో వేర్వేరు చోట్ల గంజాయితో పట్టుబడిన ఎనిమిది మందిని పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

జి.మాడుగుల: మైదాన ప్రాంతానికి గంజాయి తరలిస్తున్న కేసులో ఐదుగురిని అరెస్టు చేశామని ఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు. గిరిజన ప్రాంతాల్లో కొనుగోలు చేసిన 35 కిలోల గంజాయి మూటలను సోమవారం తెలంగాణకు చెందిన శ్రీకాంత్, శివకృష్ణ అనే ఇద్దరు వ్యక్తులు ప్రయాణికుల ఆటోలో తీసుకువస్తున్నారు. వీరిని కె.కోడాపల్లి పంచాయతీ బందవీధి జంక్షన్ వద్ద పోలీసులు పట్టుకున్నారు. దీనిపై విచారణ జరపగా పాడేరుకు చెందిన దిలీప్, హుకుంపేటకు చెందిన లలిత్, అప్పలరాజుకు ఈ వ్యవహారంతో ప్రమేయం ఉన్నట్టు ఎస్ఐ తెలిపారు. వారి నుంచి గంజాయి మూటలు, నాలుగు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నామని ఆయన వివరించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామని ఎస్ఐ పేర్కొన్నారు.

చింతూరు: ద్విచక్ర వాహనంపై అక్రమంగా గంజాయి తరలిస్తున్న ముగ్గురు యువకులను స్థానిక పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. స్థానిక పోలీస్‌స్టేషన్ వద్ద వాహనాల తనిఖీలు నిర్వహిస్తున్న క్రమంలో అనుమానాస్పదంగా ద్విచక్ర వాహనంపై వస్తున్న ముగ్గురు యువకులను తనిఖీ చేశారు. వారి నుంచి రూ.20 వేల విలువైన ఆరు కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్టు ఎస్ఐ శ్రీనివాసరావు తెలిపారు. నిందితులు పశ్చిమ గోదావరి జిల్లాకు చెందిన గౌతమ్‌జోష్, పద్మభూషణ్, కృష్ణా జిల్లాకు చెందిన జగదీష్‌గా గుర్తించామన్నారు. వీరిని రిమాండ్‌కు తరలించామన్నారు

కొమళ్లపూడిలో పట్టపగలే దొంగతనం

- ఇంట్లో ఎవరూ లేని సమయంలో తాళాలు పగులగొట్టిన దుండగులు
- బంగారం, వెండి నగలు, నగదు చోరీ
- క్లూస్ టీంతో విచారణ చేస్తున్న పోలీసులు



దొంగతనం జరిగిన ఇంట్లో విచారణ చేస్తున్న క్లూస్ టీం,ఎస్ఐ కుమారస్వామి



బీరువా పగలగొట్టి చిందరవందరగా పడేసిన వస్తువులు

బుచ్చెయ్యపేట : పట్టపగలే ఇంటి తాళాలు పగులగొట్టి బీరువాలో దాచిన బంగారు, వెండి నగలుతో పాటు నగదు పట్టుకు పోయిన సంఘటన బుచ్చెయ్యపేట మండలం కొమళ్లపూడిలో జరిగింది. బుచ్చెయ్యపేట ఎస్ఐ కుమారస్వామి కథనం మేరకు గ్రామానికి చెందిన పాము రాము మంగళవారం ఉదయం మాడుగుల మండలం గాదిరాయిలో ఉంటున్న తన అత్తవారింటికి కుటుంబ సభ్యులతో కలిసి వెళ్లాడు. సాయంత్రం ఇంటికొచ్చి చూడగా ఇంటి తాళాలు తీసి ఉండడం, లోపల బీరువాలు తెరిచి బట్టలు, ఇతర వస్తువులు చిందరవందరగా పడి ఉండడంతో దొంగతనం జరిగినట్టు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశాడన్నారు. ఇంట్లో దాచిన 8 తులాలు బంగారం, 10 తులాలు వెండి వస్తువులు, రూ. 5 వేలు వరకు నగదు దొంగతనం జరిగినట్టు బాధితుడు తెలిపాడన్నారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు క్లూస్ టీంను రప్పించి విచారణ చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు. పోలీసులకు తెలిపిన వస్తువులతో పాటు ఇంకా ఎక్కువ మొత్తంలో వస్తువులు పోయినట్టు బాధిత కుటుంబ సభ్యులు తెలుపుతున్నారు. బాధితుడు స్కూల్ కమిటీ చైర్మన్‌గా, ఆటో డ్రైవర్‌గా పనిచేయడంతో పలువురు నాయకులు బాధితుడిని పరామర్శిస్తున్నారు.